# నినాదం సాహితీ లహరి

నిఖార్సైన జర్నలిజం

గురువారం 19-03-2026


భారతదేశం అనేక సంస్కృతులు, సంప్రదాయాలు, పండుగల సమాహారం. ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత, ఒక ఆధ్యాత్మికత, ఒక సామాజిక సందేశం ఉంటుంది. అలాంటి పవిత్రమైన పండుగలలో ఉగాది తెలుగు ప్రజలకు అత్యంత ప్రాధాన్యమైన పండుగ. ఇది తెలుగు వారి నూతన సంవత్సరాదిగా భావించబడుతుంది. "ఉగాది" అనే పదం "యుగాది" అనే సంస్కృత పదం నుంచి వచ్చింది. "యుగ" అంటే కాలం, "ఆది" అంటే ప్రారంభం. అంటే కొత్త యుగానికి ఆరంభం అనే అర్థం. తెలుగు ప్రజల జీవితంలో ఉగాది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు; అది కొత్త ఆశలు, కొత్త ఆలోచనలు, కొత్త సంకల్పాలకు నాంది. ప్రకృతి కొత్త అందాలతో కళకళలాడే వసంత ఋతువులో చెట్లు కొత్త చిగురులు తొడిగి, మామిడి తోటలు పరిమళించి, కోయిలల కుహూకారాలతో ప్రకృతి మధురంగా మారుతుంది. అందుకే ఉగాది పండుగ ప్రకృతి, సంస్కృతి, ఆధ్యాత్మికత, కుటుంబ బంధాల సమ్మేళనంగా నిలుస్తుంది.

## ప్రకృతి పునరుజ్జీవనానికి ప్రతీక ఉగాది



"ఉగాది" అనే పదానికి చాలా గొప్ప అర్థం ఉంది. ఇది కేవలం కొత్త సంవత్సరం మొదలయ్యిందనే సూచన మాత్రమే కాదు. మనిషి జీవితంలో కొత్త ఆశయాలను, కొత్త ప్రయాణాన్ని ప్రారంభించే సందర్భం కూడా. భారతీయ కాలగణన ప్రకారం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ఉగాది పండుగను జరుపుకుంటారు. ఈ రోజునుంచే తెలుగు సంవత్సర గణన ప్రారంభమవుతుంది. పురాణాల ప్రకారం, బ్రహ్మదేవుడు సృష్టి కార్యాన్ని ప్రారంభించిన రోజు ఉగాది అని విశ్వసిస్తారు. అందువల్ల ఈ పండుగకు ఆధ్యాత్మికంగా కూడా గొప్ప ప్రాధాన్యం ఉంది. కొత్త సంవత్సరంలో మానవులు మంచి ఆలోచనలతో, సత్సంకల్పాలతో జీవితం ప్రారంభించాలని ఈ పండుగ సందేశం ఇస్తుంది. ఉగాది తెలుగు ప్రజల హృదయాల్లో విశేష స్థానం కలిగి ఉంది. తెలుగు వారి నూతన సంవత్సరాది వసంత ఋతువు ఆరంభానికి చిహ్నం, కొత్త పంటలు, కొత్త చిగురులు, ప్రకృతి పునరుజ్జీవనానికి సంకేతం కుటుంబ సమైక్యతకు ప్రతీక.

**ఇంటి శుభ్రత, అలంకరణ...**

ఉగాది ముందు రోజు ఇళ్లను శుభ్రం చేస్తారు. ఇంటి ముందు ముగ్గులు వేస్తారు. తలుపులకు మామిడి తోరణాలు కడతారు. మామిడి ఆకులు శుభప్రదమైనవి, ఆరోగ్యకరమైనవి అని భావిస్తారు. ఇవి ఇంటికి సౌభాగ్యాన్ని తీసుకువస్తాయని నమ్మకం.

**2. మంగళస్నానం...** ఉగాది రోజున ఉదయం తెల్లవారుజామునే లేచి నూనె రాసుకుని అభ్యంగ స్నానం చేస్తారు. దీనిని పవిత్రతకు సంకేతంగా భావిస్తారు. శరీర శుద్ధితో పాటు మనస్సు కూడా పవిత్రంగా ఉండాలని ఈ ఆచారం సూచిస్తుంది.

**3.కొత్త బట్టలు ధరించడం...** పండుగ సందర్భంగా అందరూ కొత్త బట్టలు ధరించి ఆనందంగా ఉంటారు. కొత్త దుస్తులు ధరించడం కొత్త జీవితానికి సంకేతం.

**4.దేవుని పూజ...** ఇంట్లో దేవుళ్లకు పూజలు చేస్తారు. పండ్లు, పూలు, నైవేద్యాలు సమర్పిస్తారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ప్రార్థనలు చేస్తారు.

**5.ఉగాది పచ్చడి సేవించడం...** ఉగాది పండుగలో అత్యంత ముఖ్యమైనది ఉగాది పచ్చడి. ఇది ఉగాది ప్రత్యేకత. దీని గురించి తరువాతి భాగంలో వివరంగా చూద్దాం.

**6.పంచాంగ శ్రవణం...** ఉగాది రోజున ఆలయాల్లో, ఇళ్లలో పంచాంగ శ్రవణం చేస్తారు. కొత్త సంవత్సరంలో గ్రహగతులు, వర్షపాతం, పంటలు, ఆర్థిక పరిస్థితులు, శుభముహూర్తాలు, రాశి ఫలితాలు వంటి అంశాలను పండితులు వివరిస్తారు. ఇది తెలుగు సంస్కృతిలో ఒక గొప్ప సంప్రదాయం.

**ఉగాది పచ్చడి - జీవిత తత్వాన్ని చెప్పే ప్రసాదం...**

ఉగాది పండుగ అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఉగాది పచ్చడి. ఇది తెలుగు సంస్కృతిలో ఒక అద్భుతమైన తాత్విక ఆచారం. ఉగాది పచ్చడిలో ఆరు రుచులు ఉంటాయి. అవి: వేపపూలు-చేదు (దుఃఖం), బెల్లం-తీపి (సంతోషం), చింతపండు-పులుపు (ఆశ్చర్యం), మిరపకారం/ మిరియాలు-కారం (కోపం/ఉత్సాహం), ఉప్పు-ఉప్పుదనం (స్నేహం/ రుచికరత), మామిడి ముక్కలు-వగరు (కొత్త అనుభవాలు) ఈ ఆరు రుచులు మన జీవితంలోని ఆరు భావాలను సూచిస్తాయి. జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. అందులో సుఖం, దుఃఖం, కోపం, ఆశ్చర్యం, అనుభవం, అనుబంధం అన్నీ కలగలసి ఉంటాయి. వాటన్నింటినీ సమానంగా స్వీకరించాలనే గొప్ప సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు నేర్పుతుంది. ఇది కేవలం ఆహారం కాదు. జీవన తత్వాన్ని బోధించే పండుగ ప్రసాదం.

**పంచాంగ శ్రవణం యొక్క ప్రాముఖ్యత...**

ఉగాది రోజున జరిగే పంచాంగ శ్రవణం తెలుగు ప్రజల ప్రత్యేక సంప్రదాయం. పంచాంగం అంటే కాలగణనకు సంబంధించిన గ్రంథం. ఇందులో తిథులు, వారాలు, నక్షత్రాలు, యోగాలు, కరణాలు, గ్రహస్థితులు మొదలైనవి ఉంటాయి. పంచాంగ శ్రవణం ద్వారా ప్రజలు కొత్త సంవత్సర ఫలితాలను తెలుసుకుంటారు. వ్యవసాయానికి అనుకూల సమయాలను అంచనా వేస్తారు. వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలకు ముహూర్తాలు నిర్ణయిస్తారు. సమాజం, దేశం, వాతావరణ పరిస్థితులపై అవగాహన పొందుతారు. ఇది మన భారతీయ జ్యోతిష్య సంప్రదాయం, కాలగణన జ్ఞానం ఎంత ప్రాచీనమో తెలియజేస్తుంది.

**ఉగాది-ప్రకృతి సంబంధం..**

ఉగాది పండుగ వసంత ఋతువులో వస్తుంది. ప్రకృతి ఈ కాలంలో కొత్త అందాలతో మెరిసిపోతుంది. ఎండిపోయిన కొమ్మలపై కొత్త చిగుర్లు కనిపిస్తాయి. మామిడి చెట్లు ముక్కలతో అలరిస్తాయి. కోయిలల గానం వినసొంపుగా ఉంటుంది. పూల పరిమళాలతో పరిసరాలు మధురంగా మారుతాయి. అందువల్ల ఉగాది కేవలం మనుషుల పండుగ మాత్రమే కాదు, ప్రకృతి పునరుజ్జీవనానికి ప్రతీక. కొత్త చిగురుల్లా మన జీవితంలో కూడా కొత్త ఆశలు మొలకెత్తాలని ఈ పండుగ సూచిస్తుంది.

**ఉగాది సాహిత్య, సాంస్కృతిక ప్రాధాన్యం...**

తెలుగు సాహిత్యంలో ఉగాది పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. అనేక మంది కవులు, రచయితలు ఉగాది అందాలను, వసంత ఋతువు వైభవాన్ని, జీవన తత్వాన్ని కీర్తించారు. ఉగాది సందర్భంగా కవిసమ్మేళనాలు, సాహిత్య సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉగాది పురస్కారాలు, పంచాంగ శ్రవణ సభలు జరుగుతుంటాయి. పత్రికలు, టెలివిజన్, రేడియో, సామాజిక మాధ్యమాల్లో ఉగాది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కొత్త సంవత్సరానికి సంబంధించిన సాహిత్య వ్యాసాలు, కవితలు, కథలు, శుభాకాంక్షలు ప్రచురిస్తారు. ఈ విధంగా ఉగాది పండుగ తెలుగు సంస్కృతికి ఒక ప్రతీకగా నిలుస్తుంది.

**ఉగాది మనకు ఇచ్చే సందేశం...**

ఉగాది మనకు ఇచ్చే సందేశం ఎంతో గొప్పది. అది గతాన్ని మరచిపోమని కాదు, కానీ గతం నుంచి పాఠాలు నేర్చుకోమని చెబుతుంది. భవిష్యత్తు గురించి భయపడవద్దని, ఆశతో ముందుకు సాగమని సూచిస్తుంది. జీవితంలో సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించమని బోధిస్తుంది. కుటుంబం, సంస్కృతి, ప్రకృతి, సంప్రదాయాలను కాపాడమని గుర్తు చేస్తుంది. ప్రతి కొత్త సంవత్సరం మన జీవితాన్ని మెరుగుపర్చుకునే ఒక అవకాశం అని తెలియజేస్తుంది. నేటి కాలంలో ఉగాది ప్రాముఖ్యత ప్రస్తుతం సాంకేతిక యుగంలో మన జీవనశైలి ఎంతో మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో కొందరు తమ సంప్రదాయాలను మరచిపోతున్నారు. అయినప్పటికీ ఉగాది వంటి పండుగలు మనకు మన మూలాలను గుర్తు చేసే జీవంతమైన సంస్కృతి చిహ్నాలు.

ఉగాది తెలుగు వారి ఆత్మగౌరవానికి, సంస్కృతికి, సంప్రదాయానికి ప్రతీక. ఇది కేవలం ఒక పండుగ కాదు, కొత్త ఆరంభానికి సంకేతం, కుటుంబ సమైక్యతకు వేదిక, ప్రకృతి సౌందర్యానికి వేడుక. ఉగాది పచ్చడిలోని ఆరు రుచుల్లా మన జీవితంలోనూ అనేక అనుభవాలు ఉంటాయని, వాటిని సమానంగా స్వీకరించి ధైర్యంగా ముందుకు సాగాలని ఈ పండుగ మనకు నేర్పుతుంది. తెలుగు ప్రజల హృదయాల్లో ఉగాది శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకుంది. పాత సంవత్సరంలోని చేదు జ్ఞాపకాలను వదిలి, కొత్త సంవత్సరాన్నిఆశతో, ఆనందంతో, ఆత్మవిశ్వాసంతో ఆహ్వానించే పండుగే ఉగాది.

**ఉగాది అంటే ఆనందం...**
**ఉగాది అంటే ఆరంభం...**
**ఉగాది అంటే తెలుగు సంస్కృతికి చిరస్మరణీయ మహోత్సవం**




డి. సాయినాథ్ రెడ్డి
6305584064
హైదరాబాద్ విశ్వవిద్యాలయం


## ఉగాది నూతన ఆలోచనలకు దిక్సూచి

ప్రకృతి సైతం పులకరించిపోయే తెలుగు నూతన
సంవత్సరాది ప్రజలందరికీ జీవితాల్లో మధురమైన
జ్ఞాపకాల మరుమల్లి
ఎన్నో కొత్త ఆశలకు పునాదివేసే దిక్సూచి గడచిన
కాలపు అనుభవాల పాలిట కల్పవల్లి
నూతన ఆలోచనలకు ఆజ్యం పోసే మైత్రి చిన్నచిన్నగా
చిగురించే లేలేత వృక్ష సంపదకు మైథిలి
ఆకు రాల్చే కాలమనే అంతుచిక్కని మజిలీ పరాభావ
నామ సంవత్సరపు పలకరింపుల ఆనందపుకేళి
ఒక్కరి ప్రతి ఒక్కరి గుండెల్లో చెదరని అనుభూతి
పంచాంగపు శ్రవణపు విషయాల పట్ల ఆసక్తి
భవిష్యత్తుకై చేసే పోరాటాల నేర్పరి షడ్రుచుల
గుణగణాలను తెలియజేసే ఘన కీర్తి ఆరు రుచుల
స్వభావాల వలె తోటి వారిని అర్థం చేసుకునే
నడవాలని నీతి
ప్రతి అవరోధాన్ని సైతం అవకాశంగా
మలుచుకోవాలని చాటి చెప్పే విలక్షణమైన సంస్కృతి
ఉగాది నూతన ఆలోచనలకు నాంది నిశితంగా
గమనిస్తే ఈ ఉగాది నీకు ఆత్మవిశ్వాసకు బాటసారి
నిర్దేశించుకున్న లక్ష్యాల పాలిట మార్గదర్శి సాధించే
ఆశయాల పట్ల కార్యాచరణ చేసే వినూత్న నిర్దేశి
గతంలో పొందిన ఓటమి తాలూకా గుణపాఠాల గని
తిరిగి మొక్కవోని దీక్షతో ముందుకు నడిపించే ధీశాలి
చెడు అలవాట్లను పాతరవేసేలా ప్రోత్సహించే
సహనశీలి మంచి అలవాట్లను స్వాగతించమని చెప్పే
అమృతమూర్తి అనుకున్న మంచికే ఆచరణ తప్పక
కావాలనే స్నేహశీలి అదమరిస్తే ఎక్కడి గొంగళి అక్కడే
అనిచెప్పే ప్రతినిధి ఆదాయ,వ్యయాలకు ఆగంకాకుండా
ఉండే గుండె నిబ్బరం
రాజ్యపూజ్యం, అవమానాలకు అదరకుండా ఉండే
ధైర్యం ప్రతి ఒక్కరికి ఉండాల్సిన నైజం.


వంశీకృష్ణ గౌడ్ బండి
రంగయ్యపల్లి, రేగొండ
జయశంకర్ భూపాలపల్లి
9550837962




## శుభాది ఉగాది

సంస్కృతికి ఆది ఉగాది
యుగానికి ఆది ఉగాది
ఉషస్సులకు ఆది ఉగాది
కాలానికి సంకేతం ఉగాది
వినూత్నతకు వికాసం ఉగాది
పరాభవ సంవత్సరమే కానీ
ప్రజా సంక్షేమానికి పునాది
తెలుగింటి కోకిలమ్మలా,
తెలుగంత తీయదనంలా
తొలి పొద్దు లోని వెలుగులా
సరిహద్దులేని చెలిమిలా
తొలకరి చినుకులా
సిరివెన్నెల సుమధనిలా
చిరునవ్వుల మధువనిలా
చిన్ననాటి అమ్మ పెట్టిన గోరుముద్దలా
ఇంటి ముందు దిద్దిన రంగవల్లిలా
తూర్పార పట్టుతున్న ధాన్యరాశిలా
వంత పాట పాడుతున్న కోకిలమ్మలా
పూపొదలో పుప్పడి రేణువు పూతలా
ప్రతి ఎదలో చిగురించిన తొలి ఆశలా
మామిడి తోరణాల స్వాగతం పలుకుతూ
పంచాంగ శ్రవణాల ఆశీస్సులం దుకుంటూ
షడ్రుచుల ఉగాది వరప్రసాదాన్ని ఆస్వాదిస్తూ
ఇంద్రధనస్సుల గూడు వంటి
తెలుగు సంస్కృతిని గుర్తు చేస్తుంటే
కళలకు కళ్యాణం జరిగినట్టుంది
నిజానికి ఆయువు పెరిగినట్టుంది
నమ్మకానికి పట్టం కట్టినట్టుంది.
చేదు జ్ఞాపకాల్లోని గుణపాఠాలే వేపపూతగా,
ఓటమిలోని ఒగురే మామిడికాయగా,
చవిచూచిన కష్టాలే కారంగా,
ఆటంకాల రుచే పులుపుగా,
చేసిన ఉపకారాలే ఉప్పుగా,
ఆనందాల పరవల్లే తీపి గుర్తులుగా,
షడ్రుచుల సారం జీవన వేదంగా,
పరాభవ నామ సంవత్సరానికి
స్వాగతం పలుకుదాం.




డా. పి. విజయకుమార్
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం


## ఆరోగ్యకరం... నింబ కుసుమ సేవనం

వేప పువ్వు గుణ వంతమైన ఓషధి. రక్తాన్ని శుద్ధి చేసి, వృద్ధి పరిచే గుణం కలిగి ఉంటుంది. వైద్యానికి చాలావరకు ఉపయోగించే వేప చెట్టుకు ప్రాధాన్యత ఉంది. వృక్ష సర్వాంగాలు వైద్యానికి ఉప యుక్తాలే. ప్రధానంగా రోగ క్రిమి నాశని (యాంటీ బయాటిక్)గా వాడటం కద్దు. మానవునికి ఆరోగ్య ప్రదాయిని అయిన వృక్ష రాజాలలో వేప ముఖ్యమైనది. స్వర్గలోకంలో ని "పాఎతీశింఋు" వృక్షం యొక్క అంశతో, భూలోకాన "వేపచెట్టు" పుట్టిందని, మహారాష్ట్ర సంప్రదాయక విజ్ఞానం స్పష్ట పరుస్తున్నది. ప్రాణవాయువు మూలా ధారమైన వేప వృక్ష గాలి ఆరోగ్య ప్రధానమైనదని, విజ్ఞాన శాస్త్రం స్పష్టం చేస్తున్నది. వేపపువ్వు, వేప ఆకు రెండూ ఉపయోగకరమైనవి. ఆయుర్వేద వైద్యులు వేపాకు విరివిగా వాడతారు. చర్మవ్యాధులకు పచ్చి వేపాకు నలుగు పెడతారు. అమ్మవారి జబ్బులలో రోగులకు, ఆకులు దట్టంగా ఉండే వేప రొట్ట వాడుతారు. వ్యాధులు సోకకుండా, ఇళ్ళ ముంగిళ్ళలో వేపాకు తోరణాలు కడుతుండడం, సర్వత్రా దర్శనమిచ్చే దృశ్యం. వసంత రుతువు సంబంధిత పర్వదినమైన ఉగాదినాడు దొరికే వేప పువ్వు వాడమనే పెద్దల ఉద్దేశం, ప్రాప్త కాలజ్ఞతకు నిదర్శనం. ఆ ఆచారమే సంప్రదాయ సిద్ధం, స్తవనీయం, సర్వోత్తమం. ప్రకృతి ఆరాధనకు పెరు మోసిన మన పెద్దలు, రుతు సంబంధమైన ఆయా పండుగల కార్యకలాపాలలో, ఆయా రోజులలో లభ్యమయ్యే, ప్రకృతి పదార్థాలకు, వేదాంతార్థంతో కలిపి ప్రాధాన్యత కల్పించారు. రాగల కష్టాలను, సుఖాలను అనుభవించడానికి, సంసిద్ధంగా ఉంటామని సూచించడానికి, "ఉగాది" నాడు, "నింబ కుసుమ భక్షణం", "పచ్చడి సేవనం" విధిని కల్పించారు. వేప చెట్టుకు వృక్ష శాస్త్ర నామం Helia azadirachta అని. ఇందులో ఎవశ్రీఋు అన్నది గ్రీకు పదం. azadirachta అన్నది పారశీక తద్భవం. పారశీక భాషలో వేప చెట్టుకు,Helia azadirachta అని పేరు. దీనికి ఉత్తమ వృక్షం అని అర్థం పంచాంగంలో "నింబ కుసుమ భక్షణం" అని ఉన్నా, "ధర్మసింధువు" ఈ పర్వపు ఆచరణ విధానంలో "నింబ పత్రాషనం" అని ఉంటుంది. దీనినిబట్టి ఉగాదినాడు వేపాకు తినాలని స్పష్టమవుతున్నది. పువ్వైనా, ఆకైనా, వేప చెట్టుకు సంబంధించినవి సేవించడం ఉగాది విధాయక కృత్యాలలో ఒకటిగా మత గ్రంథాలు తెలుపుతున్నాయి. పొరుగు వారైన కర్ణాటక వారు అరవ వారు, ఉగాది రోజులు వేరైనా, ఆనాడు ప్రత్యేకంగా వేప వాడతారు. తెలుగువారితో సంపర్కం ఉన్న తావులలో వారిలాగే వేప పువ్వులు ఉగాది పచ్చడికి వినియోగిస్తారు.ఇక మాళవ, మహారాష్ట్ర, వంగ దేశస్తులు ఉగాది నాడు వేపపువ్వు కాకుండా వేపాకులను వాడతారు. మాళవ దేశస్థులు ఉగాది నాడు, వేపాకులను ముద్దగా నూరి సేవిస్తారు. వంగ దేశస్థుల ఉగాది తెలుగు వారి కంటే నెల రోజుల అనంతరం రావడం చేత, వేపపువ్వు అప్పటికి అరుదుగా లభించే కారణంగా వేపాకు వాడతారు. తెలుగునాట ఉగాది నాటికి వేపచెట్లు, ముమ్మరంగా పోతపోసి ఉంటాయి. అందుకే మన పూర్వీకులు వేప వృక్ష సంబంధిత కొత్త చిగుళ్ళను ఉగాది పర్వదినాన తినడాన్ని నిర్ణయించారు. వేప పువ్వు పచ్చడి ఉగాది నాడు మాత్రమే తినడమే కాదు, దాని లభ్యతను బట్టి విశేషంగా సేకరించి, ఎండబెట్టి ఉంచుకొని, ఏడాది పొడుగునా వేయించుకుని కూరలో, పచ్చడి గానో చేసుకుని, దానితో చారు కాచుకొని సేవిస్తూ, రక్తశుద్ధి, రక్త వృద్ధిని కలిగించుకోవడం, ఆరోగ్య కాముకుల ఆచరణ. "ఉగాది పండుగ నాడు ఏమి చేస్తే, ఏడాది పొడవునా అదే చేస్తుంటారు" అనే నానుడి, వేపపువ్వు వాడకం విషయంలో వాస్తవమే అనిపిస్తుంది.


రామ కిష్టయ్య సంగన భట్ల
944059549



## కొత్త ఆశల ఆరంభం

ఇది కేవలం వసంతం కాదు
నవ వసంతం....
ప్రతి యేటా నూతన వధూవరుల వలె
పట్టుచీర, పట్టు పంచె కట్టుకుని
నూతన జీవితంలోకి
అడుగుపెడుతున్నట్టుగా
ఉండే నూతన సంవత్సరం...

అంతం కాదిది
కొత్త ఆశలకు ఆరంభం
కొత్త అడుగులకు మార్గం
కేవలం పండగ కాదిది
జీవిత సత్యం

సందేహాత్మకం కాదిది...
షడ్రుచుల సమ్మేళనంతో,
తీపి చేదుల కలయికలతో,
జీవితానికి ఓ సందేశాన్ని
ఇచ్చే సందేశాత్మక దినం
ప్రతి ఇంటా ఓ పర్వదినం
ఈ ఉగాది....


పూజ పెంజర్ల
హైదరాబాద్
విశ్వవిద్యాలయం

## షష్ట్యబ్ది పరంపరాభవ యుగాదిభావం

కం.
శ్రీరస్తను శుభమస్తను
శ్రీరాజిలు పేర్లుగాది సేమపరంప
ర్నారాధ్యవిఘ్నమస్తను
పేరుపరాభవ విజయము పిలుపామనియొ..

కం.
కొక్కొరొకోకూతశుభము
చక్కని సూర్యోదయము ర సాలము చివురుల్
మెక్కుచు పికగళ పులకలు
మక్కువ సుస్వర వసంత మాధురి ఘనమౌ...

మ.
ఇలలోనప్పుడు పూలవాటికలు హాయింగూర్చు సత్సందడిన్
వలపామామిడి నందగించెనన వహ్వాగీతవాసంతమా
గళమా సుస్వర మాశ్రయా నుకర ణాకాంక్షా కృతౌకోకిలల్
తలబోతల్గనసంతసమ్మొదవులాదారుల్ సుఖాలాపముల్...

తే.గీ.
సర్వకార్యములందును జయము కలుగు
వినతులాలించి పాలించు వినుత పర్వ
గర్వమునుగాది జనులక ఖండ కీర్తి
సుప్ర భాతప రంపరా భవము శుభము..


డా.జొన్నలగడ్డ మార్కండేయులు
9440219338


## ఆధునిక జీవన పరమార్థం

జీవితమే ఒక నాటకం
కానీ ....
ఆ నాటకంలో మరొక నాటకం
అనేకమైన అంక విభజనలు
భావం వేరు భావ ప్రకటన వేరు
నటనే నాటక ప్రధాన లక్షణం
సత్యం ఎరిగి నీవు నటించాల్సిందే సుమీ..!
లేకపోతే నీకు తెరపడుతుంది
నాంది శ్లోకం దగ్గరే
మంగళకరమైన ముగింపు ఉంటుంది...
అన్నీ గుర్తెరిగి నటించాలి మరి
ఇదే పరమార్థం ...
పరమాత్మ చెప్పిన సత్యం...
కాదంటే నిప్పుల చెలగాటం
అవునంటే అంతా సౌఖ్యమే...
మరొకసారి చెప్తున్నాను గట్టిగా గుర్తుంచుకో
నటించడం నేర్చుకో.....
మనసు విననంటున్న దానిని కట్టిపడేయి
చేయలేనంటున్నా చెయ్యాలి అని చెప్పు
చెయ్యక తప్పదు అని చెప్పు....
చివరికి ఒక మాట
ఈ నటనలో నిన్ను నీవు మరచిపోకు నేస్తమా....


- కడారి సాయిసురేశ్
ఫోన్ నెంబర్: 8639925732


## ఉగాది... తెలుగు సంవత్సరాది

వసంతాలు కురిపించడానికి
జీవితాలను నడిపించడానికి
వచ్చిన పండగే...
ఉగాది, తెలుగు సంవత్సరాది

బ్రతుకు బాటలో, వెతుకులాటలో
మార్గాన్ని చూపించడానికి వచ్చిన
మార్గదర్శి... ఉగాది.
ఉగాది, తెలుగు సంవత్సరాది

జీవితంలో తీపిని, సంతోషాన్ని
చేదును, దుఃఖాన్ని
కోపాన్ని, అహంకారాన్ని
ఇలా... షడ్రుచులు చూపించడానికే
వచ్చింది... ప్రతి సంవత్సరం వస్తుంది
ఉగాది, తెలుగు సంవత్సరాది

మనిషిలోని మంచినతనం,
ప్రేమతత్వం, సద్గుణం
తెలియజేస్తున్నటు వంటి
'ఉగాది పచ్చడి రుచి'
మూడు పువ్వులు, ఆరుకాయలు
కలిగి యున్న, పచ్చని చెట్టును
సూచిస్తున్నది, అదే
ఉగాది, తెలుగు సంవత్సరాది




## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064